ప్రజాశక్తి
ఆదివారం 2 జూన్, 2024
5
శ్రీకాకుళం



సబ్‌జైలు పరిశీలన



పాతపట్నం: జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ, ఎపి స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ వారి ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా శనివారం పాతపట్నం సబ్‌జైలను సందర్శించారు. జైలు పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. జైలులోని ముద్దాయిల పేరుపేరునా యోగక్షేమాలను, అందుతున్న వైద్య సదుపాయాలు, తదితరవి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ ఎ.అజయ్‌కుమార్, మానేం రోషిణి, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

సాగుకు సన్నద్ధం



రుతుపవనాలు ప్రవేశించడంతో శుక్రవారం జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. దీంతో రైతులు, వ్యవసాయశాఖ అధికారులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో పలాస నియోజకవర్గంలో 27,784 ఎకరాల్లో వరి సాగు లక్ష్యంగా అధికారులు నిర్ధేశించారు. దీంతో రైతులు చాలాచోట్ల పొలాలను దుక్కి దున్నుతున్నారు. ప్రభుత్వం కూడా సబ్సిడీ విత్తనాలు, ఎరువులను సిద్ధం చేస్తోంది. అన్నదాతలు విత్తనాల కోసం తమ పరిధిలో ఉన్న రైతుభరోసా కేంద్రాలకు (ఆర్‌బికె) వెళ్లి తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. ఈ ప్రక్రియ జిల్లావ్యాప్తంగా దాదాపు అన్ని ఆర్‌బికెల్లో మొదలైంది.

- పలాస నియోజకవర్గంలో 27,784 ఎకరాల సాగు లక్ష్యం
- వ్యవసాయశాఖ కార్యాలయంలో పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం
- విత్తనాల కోసం ఆర్‌బికెల్లో పేర్లు నమోదు
- రైతులు కట్టిన వరి విత్తనాలకు టెస్టింగ్

ప్రజాశక్తి- పలాస

ఖరీఫ్ సాగుకు వ్యవసాయ అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ ఏడాది పలాస నియోజకవర్గంలో పలాస మండలంలో 1124 ఎకరాల్లో, మందస మండలంలో 19500 ఎకరాల్లో, వజ్రపుకొత్తూరు మండలంలో 1160 ఎకరాల్లో వరి సాగు అయ్యే అవకాశాలు ఉన్నాయి. దీని ఆధారంగా రైతులకు కావాల్సిన వరి విత్తనాలకు వ్యవసాయ అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక పంపించినట్లు చెబుతున్నారు.

3,163 క్వింటాళ్ల విత్తనాలకు ఇండెంట్

నియోజకవర్గం పరిధిలో పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల పరిధిలో 27784 ఎకరాలు సాగుకు 9 రకాలు వరి విత్తనాలకు 3,163 క్వింటాళ్ల అవసరం ఉన్నట్టు నివేదిక ఇప్పటికే వ్యవసాయ ఉన్నంతధికారులకు అందించారు. మందస మండలానికి వరి విత్తనం ఎంటియు 1061 రకం 872 క్వింటాళ్లు, ఎంటియు 1064 రకం 145 క్వింటాళ్లు, ఎంటియు 1121 రకం 5 క్వింటాళ్లు, ఎంటియు 7029 (స్వర్ణ) రకం వంద కింటాళ్లు, ఎంటియు 1318 రకం 25 క్వింటాళ్లు, ఆర్‌జెఐ 2,537 రకం 150 క్వింటాళ్లు, బిపిటి 3291 (సోనామసూర్) రకం రెండు క్వింటాళ్లు, బిపిటి 5204 (సాంబ) రకం వంద క్వింటాళ్లు, ఎంటియు 1224 రకం 22 క్వింటాళ్లు, మండలానికి మొత్తం 1421 క్వింటాళ్లు వరి విత్తనాలకు నివేదిక ఇచ్చారు.

పలాస మండలానికి ఎంటియు 1061 రకం 227 క్వింటాళ్లు, ఎంటియు 1064 రకం 32 క్వింటాళ్లు, ఎంటియు 1121 రకం 19 క్వింటాళ్లు, ఎంటియు 7029 (స్వర్ణ) రకం 250 క్వింటాళ్లు, ఎంటియు 1318 రకం 28 క్వింటాళ్లు, ఆర్‌జిఐ 2,537 రకం 67 క్వింటాళ్లు, బిపిటి 3291(సోనామసూర్)రకం 3 క్వింటాళ్లు, బిపిటి 5204 (సాంబ) రకం 259 క్వింటాళ్లు, ఎంటియు 1224 రకం 62 క్వింటాళ్లు మొత్తం 948 క్వింటాళ్లు వరి విత్తనాలకు నివేదిక ఇచ్చారు.

వజ్రపుకొత్తూరు మండలానికి ఎంటియు 1061 రకం 87 క్వింటాళ్లు, ఎంటియు 1064 రకం 80 క్వింటాళ్లు, ఎంటియు 1121 రకం 136 క్వింటాళ్లు, ఎంటియు 7029 (స్వర్ణ) రకం 137 క్వింటాళ్లు, ఎంటియు 1318 రకం 6 క్వింటాళ్లు, ఆర్‌జెఎల్ 2537 రకం 5 క్వింటాళ్లు, బిపిటి 3291 (సోనామసూర్) రకం 11 క్వింటాళ్లు, బిపిటి 5204 (సాంబ) రకం 277 క్వింటాళ్లు, ఎంటియు 1224 రకం 56 క్వింటాళ్లు మండలానికి మొత్తం 748 క్వింటాళ్లు వరి విత్తనాలకు నివేదిక ఇచ్చారు.


విత్తనాలు పరీక్షించుకోవాలి

రైతులు కట్టిన వరి విత్తనాలను రైతులు పరీక్షించుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎల్.మధు తెలిపారు. పలాస మార్కెట్ యార్డులోని అగ్రి టెస్టు ల్యాబ్‌లో విత్తనం పరిస్థితులు తెలుసుకోవచ్చు అన్నారు. విత్తనం పూర్తి స్థాయి పరిస్థితి తెలుసుకునేందుకు సుమారు 7 రోజుల నుంచి 15 రోజులు పడుతుందన్నారు. 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు వ్యవసాయ కార్యాలయంలో సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రైతులు పొలంలో ఈ విత్తనాలు వేయడం వల్ల మంచి ఎరువు భూమికి అందుతుందని అన్నారు. రైతులు దీని వినియోగించుకోవాలని కోరారు.



వర్షపాత వివరాలు...

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. అత్యధికంగా కంచిలి మండలంలో 69.60 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు కాగా, అతి స్వల్పంగా సంతబొమ్మాళి మండలంలో ఒక మిల్లీమీటర్ వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా వర్షం కురవడంతో జిల్లా ప్రజలకు ఊరాట కలిగించింది. మరోవైపు ప్రస్తుతం కురుస్తున్న వర్షం ఖరీఫ్‌కు ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పలాసలో 25.40, మందసలో 16.20, కంచిలిలో 69.60, ఇచ్ఛాపురంలో 68.20, కవిటిలో 67.0, సోంపేటలో 65.40, నందిగాంలో 2.20, జలుమూరులో 16.20, సరుబుజ్జిలిలో 8.40, బూర్జలో 6.60, జి.సిగడాంలో 1.0, ఆముదాలవలసలో 19.40, నరసన్నపేటలో 4.60, పోలాకిలో 5.80, గారలో 12.20, శ్రీకాకుళంలో 18.80, పొందూరులో 5.20, లావేరులో 8.20, రణస్థలంలో 18.40, ఎచ్చెర్లలో 34.40, కొత్తూరులో 12.60, పాతపట్నంలో 8.20, మెళియాపుట్టిలో 14.20, హిరమండలంలో 6.20, ఎల్ఎన్‌పేటలో 9.40, సారవకోటలో 6.60, టెక్కలిలో 1.60, సంతబొమ్మాళిలో 1.0, కోటబొమ్మాళిలో 10.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.


రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

స్ట్రాంగ్‌రూమ్‌ల పరిశీలన

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత పటిష్టంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. మండలంలోని చిలకపాలెం శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఉన్న స్ట్రాంగ్ రూమ్‌లను ఆముదాలవలస నియోజకర్గ రిటర్నింగ్ అధికారి, జెసి ఎం.నవీన్‌తో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల వారీగా స్ట్రాంగ్ రూమ్‌లన్నీ క్షుణ్ణంగా పరిశీలించి సందర్శకుల పుస్తకంలో సంతకం చేశారు.

స్ట్రాంగ్ రూమ్ నుంచి కౌంటింగ్ రోజున ఇవిఎంలను కౌంటింగ్ గదులకు తీసుకువచ్చే విధానాన్ని పరిశీలించారు. అనంతరం అక్కడ నుంచి పార్కింగ్ ప్రాంతాన్ని పరిశీలించి పలు సూచనలు జారీ చేశారు. అంబులెన్స్‌లు నిలుపు స్థలం, వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాటు చేయనున్న స్టాల్స్, ఫుడ్ స్టాల్స్, తదితర ఏర్పాటు చేయనున్న ప్రాంతాలను పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలనలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, జెడ్‌పి సిఇఒ డి.వెంకటేశ్వరరావు, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, డిపిఒ వెంకటేశ్వరరావు, చల్లా ఓబులేసు, డిప్యూటీ సిఇఒ వెంకటరామన్, తహశీల్దార్లు పాల్గొన్నారు.


దిశానిర్ధేశం చేస్తున్న ఎస్‌పి జి.ఆర్ రాధిక

కౌంటింగ్‌కు పటిష్ట బందోబస్తు

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

పోలీస్ సిబ్బందికి కేటాయించిన పాయింట్లలో బాధ్యతగా విధులు నిర్వహించాలని ఎస్‌పి జి.ఆర్.రాధిక ఆదేశించారు. మండలంలోని చిలకపాలెం వద్ద ఉన్న శివాని ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ బందోబస్తును శనివారం పరిశీలించి విధి విధానాలు, తీసుకోవాల్సిన భద్రత చర్యలపై దిశానిర్ధేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాల్లో అల్లర్లు, ఘర్షణలకు పాల్పడే వ్యక్తులను ముందుస్తుగా గుర్తించి పికప్ వాహనాల్లో ఎక్కించాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరాదని సూచించారు. ఏజెంట్లను కుణ్ణంగా తనిఖీ చేసి, రిటర్నింగ్ అధికారి జారీ చేసిన అనుమతి పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. బ్రీత్ ఎనలైజర్ ద్వారా ఆల్కహాల్ పరీక్షించి అనంతరం కౌటింగ్ కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలకు విచ్చేసే కౌంటింగు ఏజంట్ల, అభ్యర్థుల వాహనాలను ప్రత్యేకంగా నిర్ధేశించిన పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే చేయించాలన్నారు. సిఆర్‌పిసి 144 సెక్షన్, సెక్షన్ 30 పోలీసు యాక్టు అమలులో ఉన్నందున ప్రజలు గుమిగూడి ఉండకుండా చూడాలన్నారు.

జాతీయ రహదారిపై, కౌంటింగ్ పరిధిలో ట్రాఫిక్ రెగ్యులేషన్, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేకంగా చర్యలు చేపట్టాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత, రూఫ్ టాప్ బందోబస్తు ఏర్పాటు చేశామని అన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినట్లయితే వెంటనే ఇన్‌ఛార్జి అధికారులకు తెలపాలని పేర్కొన్నారు. జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ఏ విధంగా ప్రశాంతంగా పూర్తి చేశామో, అదేవిధంగా కౌంటింగ్ ప్రక్రియ కూడా సజావుగా శాంతియుతంగా పూర్తి చేసేందుకు బందోబస్తులో పాల్గొన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు జి.ప్రేమకాజల్, వి.ఉమామహేశ్వరరావు, డిఎస్‌పిలు శృతి, శ్రీనివాసరావు, శేషాద్రినాయిడు, ట్రైనీ డిఎస్‌పి రాజా పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యల పరిష్కారం

జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రానున్న వర్షాకాలం నేపథ్యంలో వ్యవసాయ, వైద్య ఆరోగ్యశాఖ, విద్యుత్ శాఖలకు పని ఒత్తిడి అధికంగా ఉంటుందని, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎప్పటికప్పుడు సమస్యలను తీర్చాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. జెడ్‌పి సమావేశ మందిరంలో శనివారం జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామీణ నీటి సరఫరా, ఎపిఇపిడిసిఎల్, వ్యవసాయశాఖ, ఉపాధి హామీ, వైద్య ఆరోగ్యశాఖల ద్వారా చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి, ఆయా శాఖల పురోగతిపై సమీక్షించారు. మండలాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పలువురు జెడ్‌పిటిసిలు ప్రస్తావించారు. ఉద్దానం తాగునీటి పథకం పూర్తిస్థాయిలో పనిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఏ చిన్న పొరపాటుకు తావివ్వరాదని స్పష్టం చేశారు. లీకేజీలు, మెయింటినెన్స్, పెండింగ్ పనులను త్వరితగతను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో లోవోల్టేజ్ సమస్య పరిష్కారానికి ఇటీవల కాలంలో 1459 పనులు చేపట్టామని అన్నారు. కొత్తగా ఏడు సబ్‌స్టేషన్లను నిర్మించామని విద్యుత్‌శాఖ ఎస్ఇ వివరించారు. జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.శ్రీధర్ మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌కు గాను 1.70 లక్షల హెక్టార్లలో పంటలు పండించేందుకు ప్రణాళికలు రూపొందించామని అన్నారు. 36 వేల క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 6 నుంచి రైతులకు విత్తనాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. స్వర్ణ 1318 రకం, 1224 రకం విత్తనాలను ఈసారి అధికంగా పంపిణీ చేస్తామని, అందుకుతగ్గ స్టాక్ పాయింట్లను సిద్ధం చేశామని పేర్కొన్నారు. ఉపాధి హామీ కింద జిల్లాలో ఇప్పటివరకు 33 రోజుల సగటు పనిదినాలు కల్పించామని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.చిట్టిరాజు తెలిపారు. ఆ శాఖపై చర్చలో భాగంగా మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకు జోరుగా పనులు చేపడతామని తెలిపారు. అందుకు తగ్గ ప్రణాళిక సిద్ధంగా ఉందన్నారు. వచ్చే మార్చి నాటికి జిల్లాలో జాబ్ కార్డు ఉన్న వారందరికీ 75 రోజుల కనీస పని దినాలను కల్పిస్తామన్నారు. జిల్లాలోని 1.55 లక్షల కుటుంబాలకు వంద రోజుల పనికల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. డిఎంహెచ్ఒ బి.మీనాక్షి మాట్లాడుతూ కిడ్నీ వ్యాధిగ్రస్తులకు జిల్లాలో మందులు అందుబాటులో ఉన్నాయని, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ విధానం ద్వారా అవసరమైన వారికి మందులు పూర్తిస్థాయిలో సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. జూన్ నెలలో మలేరియా కేసులు, జూలై నెలలో డయేరియా కేసులు నమోదవుతుంటాయని అన్నారు. వీటికి చెక్ పెట్టేందుకు తగిన ప్రణాళికతో సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. సమావేశంలో ముందుగా స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. అనంతరం జరిగిన సర్వసభ్య సమావేశంలో వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, వైస్‌చైర్‌పర్సన్ పాలిన శ్రావణి, జెడ్‌పి సిఇఒ డి.వెంకటేశ్వరరావు, నీటిపారుదలశాఖ ఎస్ఇ పొన్నాడ సుధాకర్, బిసి కార్పొరేషన్ ఇడి గడ్డెమ్మ, సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, తూర్పుకాపు, కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయ

ఆకట్టుకున్న మాక్‌డ్రిల్


మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - పలాస

నిత్యం రద్దీగా కాశీబుగ్గ పాతబస్టాండ్ పరిసరాలు రాజీవ్‌గాంధీ విగ్రహం వద్దకు ఒక్కసారిగా ఆందోళనకారులు చేరి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అటువైపు పోలీసులు బెటాలియన్ తుపాకీలతో ముందుకు దూసుకు రావడంతో ఆందోళనకారులు టైర్లు తలబెట్టారు. పోలీసులు వైపు ఆందోళకారులు రాళ్ల విసిరారు. దీంతో ముందుగా పోలీసులు బాష్పవాయివును విసిరి ఆందోళన కారులను చెదరగొట్టే ప్రయత్నం చేస్తుండగా, ఇంతలో అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఆందోళకారులు, పోలీసులు వారి వారి ప్రయత్నాలు చేస్తూ ముందుకు వస్తున్న తరుణంలో ఆందోళనకారులు శృతిమించడంతో వారిపై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ సంఘటనలో ఒకరు గాయపడడంతో తక్షణమే అక్కడకు అంబులెన్స్ చేరుకొని క్షతగాత్రుడును ప్రథమ చికిత్స అందించి అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించి ఆందోళనకారులను చెదరగొట్టారు. శనివారం ఈ సంఘటన బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో చోటుచేసుకోవడంతో స్థానికులు, ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. కట్ చేస్తే సార్వత్రిక ఎన్నికలు పూర్తయి ఈ నెల 4న ఫలితాలు వెలువడే క్రమంలో శనివారం సాయంత్రం ఎగ్జిట్ పోల్ విడుదల కానున్న నేపథ్యంలో మందస్తు ఎటువంటి అవాంఛీనీయ సంఘటనలు జరిగినా పోలీసులు చర్యలు ఈ విధంగా ఉంటాయని తెలియజేసేందుకు పోలీసులు ఇటువంటి మ్యాక్‌డ్రిల్ డెమో ప్రదర్శన నిర్వహించారు. అసలు విషయం నెమ్మదిగా తెలుసుకున్న స్థానికులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. పాతబస్టాండ్ సమీపంలో సుమారు గంటసేపు జరిగిన ఈ పోలీసుల మార్క్‌డ్రిల్ అందరినీ బెంబేలెత్తించింది. పోలీసులు కథ, స్క్రీన్‌ప్లే, డైరెక్షన్‌లో జరిగిన ఈ పోలీసు యాక్షన్ మ్యాక్‌డ్రిల్ అందరికీ ఒక్కసారిగా చుక్కలు చూపించాయి. కార్యక్రమంలో కాశీబుగ్గ నాగేశ్వరరెడ్డి, కాశీబుగ్గ సిఐ విజయానంద్, కాశీబుగ్గ ఎస్ఐలు పారినాయుడు, వెంకటరావు పాల్గొన్నారు.

అలసత్వం వహించరాదు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సార్వత్రిక ఎన్నికల ఫలితాల ప్రకటనలో ఎక్కడా అలసత్వం వహించకుండా, పూర్తి పారదర్శకతతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. కౌంటింగ్ ప్రక్రియ సందర్భంగా ఈ నెల 4న అధికారుల నిర్వర్తించాల్సిన విధులు, చేపట్టాల్సిన బాధ్యతలపై సంబంధిత అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరెవరు ఏయే విధులు నిర్వహించాలనే క్రమంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. రౌండ్ వారీగా ఫలితాల ప్రకటన కోసం, ఎన్కోర్లో డేటా ఎంట్రీ, ట్యాబులేషన్ సిబ్బంది కచ్చితత్వంతో పనిచేయడం వంటివి కీలకమన్నారు. కౌంటింగ్‌కు 24 గంటల ముందు చేయాల్సిన పనులను ఎన్నికల సంఘం సూచనల ప్రకారం పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రతిఒక్కరికీ ఎటువంటి ఇబ్బందులూ లేకుండా సజావుగా కౌంటింగ్ సాగేందుకు బాధ్యతలు కేటాయించిన ఆయా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో ఎస్‌పి జి.ఆర్.రాధిక జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, అన్ని మండలాల తహశీల్దార్లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ పాల్గొన్నారు.


కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మనజీర్ జిలానీ సమూన్

దోమల నియంత్రణతోనే మలేరియా నిర్మూలన

డిఎంహెచ్ఒ మీనాక్షి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దోమలు నియంత్రణతోనే మలేరియా వ్యాధిని అరికట్టవచ్చునని, జూన్ నెలలో మలేరియా వ్యతరేక మాసోత్సవం ఏటా నిర్వహిస్తున్నామని డిఎంహెచ్ఎఒ బి.మీనాక్షి అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు సందర్భంగా ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు ఆరోగ్య, మునిపల్, సచివాలయ సిబ్బందితో శనివారం ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఆమె ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మలేరియా, డెంగీ వ్యాధుల నియంత్రణ చర్యలను ప్రతి పిహెచ్‌సి పరిధిలో నిర్వహిస్తున్నామని అన్నారు. 2016 నుంచి మలేరియా, డెంగీ కేసులు తగ్గుతూ వస్తుందని తెలియచేయడం ఆనందంగా ఉందన్నారు. డెంగీ 2021లో 117 కేసులు, 2022లో 89 కేసులు, 2023లో 54 కేసులు, 2024లో 5 కేసులు ఇంతవరకు గుర్తించామని అన్నారు. మలేరియా 2021లో 22 కేసులు, 2022లో 9 కేసులు, 2023లో 11 కేసులు, 2024లో ఒక్క కేసు నమోదైనట్టు వివరించారు. రోజు విడిచి రోజు జ్వరం, వనుకుతో కూడిన జ్వరం, తలనొప్పి, ఒంటి నొప్పులు, వాంతులు చెమటలు పట్టుట, తీవ్రమైన కేసుల్లో ఫిట్స్, అపస్మారక స్థితి మలేరియా వ్యాధి లక్షణాలని, వ్యాధి నిర్ధారణకు పరీక్షలు ఏయించుకోవాలన్నారు. సకాలంలో మందువలు వాడడం ద్వారా నయం చేసుకోవచ్చన్నారు. మలేరియా వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. పడుకునేటప్పుడు దోమతెరలు తప్పనిసరిగా వాడాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో కీటకనాశిని పిచికారీ తప్పనిసరిగా చేయుంచుకోవాలన్నారు. పిల్లలకు చేతులు, కాళ్లకు నిండుగా ఉండే దుస్తులు వేయాలన్నారు. సొంత చికిత్స చేయకుండా దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి రక్తపరీక్ష చేయించుకుని వైద్యులు సూచించిన మందులు తప్పనిసరిగా వాడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి పి.వి.సత్యనారాయణ, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, ప్రముఖ సంఘ సేవాకర్త మంత్రి వెంకటస్వామి, మలేరియా క్యన్సల్టెంట్ శ్రీకాంత్, ఎస్‌యుఒ కె.సూరిప్పారావు, ఎం.నరసింహులు, మురళి, సాయికుమార్ పాల్గొన్నారు.


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న మీనాక్షి

ఫలితం ఎలా ఉంటుందో?

ప్రజాశక్తి- శ్రీకాకుళంప్రతినిధి

అభ్యర్థుల భవితవ్యం తేలడానికి ఇంకా రెండు రోజులే ఉంది. సుమారు 20 రోజుల కిందట ఇవిఎంల్లో నిక్షిప్తమైన ఓట్లను మంగళవారం లెక్కించనున్నారు. కౌంటింగ్‌కు రోజులు దగ్గరపడే కొద్దీ అభ్యర్థులు, ఆయా పార్టీల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ ఎన్నికల్లో ఫలితాలు ఎలా ఉండబోతున్నాయి, రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి రాబోతోంది అనే అంశాలపైనే టీ దుకాణాలు, టిఫిన్ సెంటర్లు నుంచి షాపింగ్ మాల్స్ వరకు, ప్రభుత్వం, ప్రయివేట్ కార్యాలయాల్లోనూ మాట్లాడుకుంటున్నారు. సోషల్ మీడియాలో వస్తున్న సర్వేలపైనా చర్చించుకుంటు న్నారు. ఈ సారి ఫలానా పార్టీ అధికారంలోకి వస్తుందట, ఆ నియోజకవర్గంలో ఆ పార్టీ అభ్యర్థి గెలుస్తారట అని ఎవరికి తోచింది వారు మాట్లాడుకుంటున్నారు. మరోవైపు అభ్యర్థులు మే 13న పోలింగ్ జరగగానే ఓటింగ్ సరళి, ఏ ప్రాంతంలో తమకు అనుకూలంగా ఓటింగ్ జరిగింది, ఎక్కడ ప్రతికూలంగా ఉందనే అంశాలపై నాయకులు, ఏజెంట్లతో కలిసి లెక్కలతో కుస్తీ పట్టారు. పోలింగ్‌కు, కౌంటింగ్‌కు మధ్య చాలా సమయం వ్యత్యాసం ఉండటంతో కొందరు విహార యాత్రలకు వెళ్లి రిలాక్స్ అయ్యారు. కౌంటింగ్‌కు సమయం దగ్గర పడటంతో వారంతా ఇళ్లకు చేరకున్నారు. ఫలితంపై ఒక వైపు టెన్షన్ పడుతూనే ఏజెంట్లతో సమావేశం నిర్వహించి వారికి జాగ్రత్తలు చెప్తున్నారు.

టిడిపి, వైసిపి నాయకులు ఎవరికి వారే గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. పోలింగ్ శాతం భారీగా నమోదు కావడం తో అదంతా ప్రభుత్వ వ్యతిరేకతేనని, తాము విజయం సాధిస్తామని టిడిపి అభ్యర్థులు గట్టిగా చెప్తున్నారు. మహిళా ఓటర్లు, సంక్షేమ పథకాల అమలుతో సానుకూల ఓటింగ్ జరిగిందని తమ గెలుపు పక్కా వైసిపి అభ్యర్థులు విశ్వసిస్తున్నారు. పార్టీల విజయవకాశాలపై రెండు పార్టీలూ ధీమాగా ఉన్నా వారి సీట్లకు సంబంధించి మాత్రం ఆందోళన నెలకొంది. తమకు పోలయ్యే ఓట్లపై వేసుకున్న లెక్కలన్నీ సంతృప్తినిచ్చినా మనసులో ఏదో మూలన కీడు శంకిస్తోంది. గట్టెక్కుతామా లేదా అన్న సంశయం వారిని వెంటాడుతోంది.

పోలింగ్‌కు, ఫలితాలకు సుమారు 20 రోజులు వ్యత్యాసం ఉండటంతో ఫలితాలపై నానాటికీ ఉత్కంఠ పెరిగింది. ముఖ్యంగా అభ్యర్థులు క్షణమొక యుగంలా గడిపారు. పోలింగ్ ముగిసిన తర్వాత సాధారణంగా ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వెలువడాల్సి ఉండగా, చివరి దశ పోలింగ్ శనివారం సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగడంతో సర్వే ఫలితాలపై ఎన్నికల కమిషన్ నిషేధం విధించింది. దీంతో ఎగ్జిట్ పోల్ ఫలితాలు రావడటంలోనూ జాప్యం చోటుచేసుకుంది. శనివారం ఆరున్నర గంటల తర్వాత సర్వే ఫలితాలు విడుదల చేసుకోవచ్చని ఎన్నికల కమిషన్ సూచించడంతో గత రెండు మూడు రోజులోగా ఎగ్జిట్ పోల్ ఫలితాల కోసం అంతా ఆత్రంగా ఎదురుచూశారు. శనివారం సాయంత్రం ఆరున్నర గంటలు ఎప్పుడవుతుందా అని చూశారు. నిమిషాలు గడుస్తున్న కొద్దీ టెన్షన్ అంతకంతకూ పెరిగిపోయింది. ఒక్క మాటలో చెప్పాలంటే వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌ను తలపించింది. ఎగ్జిట్ ఫలితాల కోసం అంతా టివిలకు అతుక్కుపోయారు. వివిధ సర్వే సంస్థలు రకరకాల ఫలితాలను వెల్లడించడంతో మరింత గందరగోళా నికి దారి తీసింది. వాటిలో అత్యధిక సర్వేలు టిడిపి కూటమి గెలుస్తుందని చెప్పడంతో ఆ పార్టీ శ్రేణులు ఆనందంతో ఉబ్బితబ్బియ్యాయి. రాష్ట్రంలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయో ఆయా సర్వే సంస్థలు చెప్పినా తమ గెలుపుపై అభ్యర్థులు పార్టీ పెద్దలకు ఫోన్లు చేసి ఆరా తీశారు. తమ ఎమ్మెల్యే గెలుస్తారా? లేదా? అంటూ పార్టీ శ్రేణులు అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు. కొన్ని సర్వే సంస్థలు వైసిపి నెగ్గుతుందని చెప్పడంతో ఆ పార్టీ శ్రేణులూ ధీమాగానే ఉన్నాయి. తమదే విజయమంటూ అభ్యర్థులు, నాయకులు బయటకు చెప్తున్నా ఆందోళన మొదలైంది. తమ స్థానాన్ని నిలబెట్టుకుంటామా అని సిట్టింగ్‌ల్లో టెన్షన్ ప్రారంభమైంది. అసెంబ్లీకి వెళ్లే అవకాశం దొరుకుందా? లేదా? అంటూ కొత్తగా బరిలో దిగిన అభ్యర్థులు సర్వే ఫలితాల కోసం పార్టీ పెద్దలను ఆరా తీయడం ప్రారంభించారు. ఎగ్జిట్ సర్వే ఫలితాలను ఎవరికి వారు అన్వయించుకున్నా జూన్ నాలుగో తేదీన వెలువడే ఎగ్జాట్ ఫలితాల కోసం అంతా వేచి చూడాల్సిందే.


చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఎల్‌పిఒ రమణ

చెత్త నుంచి సంపద సృష్టించాలి

ప్రజాశక్తి- పలాస

గ్రామాల్లో ఇంటింటి నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను వేర్వేరు చేసి సంపద సృష్టించాలని టెక్కలి డిఎల్‌పిఒ ఐ.వి.రమణ కార్యదర్శులకు ఆదేశించారు. మండలంలోని తర్లకోటలో ఉన్న చెత్తా సంపద కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరుచేసి కంపోస్టు ఎరువును తయారు చేయవచ్చు అన్నారు. వ్యవసాయంలో కూరగాయలు, పళ్ల తోటల పెంపకంలో ఈ ఎరువు ఉపయోగపడుతుందని అన్నారు. చెత్త సంపద కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. దీనిపై గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆయా కార్యదర్శులదే అన్నారు. ఆయనతో పాటు కార్యదర్శి సద్గుణబాబు, సచివాలయం ఉద్యోగులు ఉన్నారు.


రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎఒ శ్రీనివాసరావు

రైతు డిపో తనిఖీ

కొత్తూరు: మండల కేంద్రంలోని జైకిసాన్ రైతు డిపోను మండల ఎఒ ఎన్.శ్రీనివాసరావు శనివారం తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా ప్రత్తి విత్తనాల నమూనాలను పరిశీలించారు. నమూనాలు తాడేపల్లిగూడెంలోని ప్రాంతీయ విత్తన పరీక్షా కేంద్రానికి పంపించారు. ఈ సందర్భంగా అక్కడ భౌతిక స్వచ్ఛత, జన్యు స్వచ్ఛత ప్రమాణాల పరీక్ష నిర్వహిస్తారని అన్నారు. పరీక్షల అనంతరం స్వచ్ఛతా ప్రమాణాలు నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం లేకపోతే విత్తన చట్టం ప్రకారం విత్తనాలు తయారు చేసిన కంపెనీ పైన, అలాగే అమ్ముతున్న డీలర్‌పైన తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈయన వెంట వ్యవసాయ విస్తారణాధికారులు ఎల్.మాధవరావు, బి.రమేష్ ఉన్నారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధ్యాపకులు

ప్రిన్సిపాల్‌గా సత్యనారాయణ

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా అర్థశాస్త్ర అధ్యాపకులు సురవరపు సత్యనారాయణ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన వావిలపల్లి నారాయణస్వామి మే 31న ఉద్యోగ విరమణ చేశారు. ఎఫ్‌ఎసి ప్రిన్సిపాల్‌గా సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. సరుబుజ్జిలి మండలం కొత్తకోటకు చెందిన సత్యనారాయణ రణస్థలం, బారువ, పాలకొండ బాలికల కళాశాలల్లో గతంలో ఎఫ్‌ఎసి ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. అర్థశాస్త్ర అధ్యాపకునిగా ప్రియాగ్రహారం, పోలాకి, పాలకొండ, సరుబుజ్జిలి, రణస్థలం, బారువలలో పనిచేశారు. దీంతో అధ్యాపకులు వదనగిరి, అప్పన్న, డాక్టర్ మల్లేశు, సోమశేఖర్, శాంతారావు, ఆనందరావు, రాంప్రసాద్‌లు పుష్పగుచ్చాలు అందజేసి అభినందించారు.


పాఠ్యపుస్తకాలతో ఎంఆర్‌సి సిబ్బంది

ఎంఆర్‌సికి చేరిన పాఠ్యపుస్తకాలు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేయాల్సిన పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, స్కూలు బ్యాగులు శనివారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సికి చేరుకున్నాయి. 8వ తరగతికి సంబంధించి 6,800 పాఠ్య పుస్తకాలు, 35,300 నోటు పుస్తకాలు, 5,102 స్కూలు బ్యాగులు వచ్చాయని ఎంఇఒ-2 పట్నాన రాజారావు తెలిపారు. సంబంధిత సామగ్రిని ఆయన పరిశీలించారు. ఆయనతో పాటు ఎంఆర్‌సి సిబ్బంది సత్యన్నారాయణ, పోతయ్య తదితరులున్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

అంజనా యూత్ దాతృత్వం

ప్రజాశక్తి - కవిటి

మండలంలోని వి.జల్లుపుట్టుగకు చెందిన అంజనా యూత్ అసోషియేషన్, బెంతు ఒరియా సంఘం దాతృ త్వాన్ని చాటుకున్నాయి. డి.గొనపపుట్టుగ పంచాయతీ వి.జల్లుపుట్టుగకు చెందిన దాశరథ దళాయి కొన్నేళ్లుగా ఉదర సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స కోసం రూ.2 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. రెక్కాడితే గాని డొక్కాడని దాశరథి కుటుంబం దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. విషయం తెలుసు కున్న గ్రామానికి చెందిన అంజనా యూత్ అసోసియేషన్, బెంతు ఒరియా సంఘంతో కలిసి శనివారం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. అధైర్య పడొద్దు అండగా ఉంటామని చెప్పి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.30 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మరింత మంది దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి దాశరథకి ఆర్థిక సాయం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో అంజనా యూత్ అసోసియేషన్, బెంతు ఒరియా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కథానిలయం పుస్తకాల వితరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కారా మాస్టారు పాతిక సంవత్సరాలు కాలికి బలపం భుజంకి జోలిగా ఊరూరా తిరిగి పత్రికలు, పుస్తకాలు కథానిలయానికి చేర్చారు. రెండింటికి మించిన వాటిని కూడా నేటిదాకా భద్ర పరుస్తూ వచ్చారు. ఉచితంగా సాహిత్య అభిమానులకు అందించ దలిచాము. ఇందులో భాగంగా వారి తనయుడు కాళీపట్నం సుబ్బారావు స్థానిక వేమన కవితామయం సంస్థ వ్యవస్థపక అధ్యక్షులు కవి మహ్మద్ రఫీ (ఈవేమన)కు ప్రముఖ కవుల కలాల నుంచి జారువారిన సుమారు 75 కవితా సంపుటాలు వితరణగా అందించారు. ఈ పుస్తకాలను వేమన కవితామయం అధ్యక్షులు ఈవేమన ఆ సంస్థ కోశాధికారి కళ్లేపల్లి ఉదయ్ కిరణ్‌కు అందజేశారు. జిల్లా గ్రంధాల కార్యదర్శి కార్యదర్శి బుర్రి కుమార్ రాజా పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి శిబిరాలు

ప్రజాశక్తి- లావేరు

ప్రతి విద్యార్థి పొదుపు నేర్చుకోవాలని పోస్టుమాస్టర్ లక్ష్మీ అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో పోస్ట్‌ఆఫీసులో ఉండే ఎస్‌బి, ఆర్‌డిలపై విద్యార్థులకు తెలియజేశారు. సుకన్య సమృద్ధి యోజన పథకం కోసం వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకులు టి. వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : స్థానిక శాఖాగ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా మ్యూజికల్ చైర్, స్పోకెన్ ఇంగ్లీష్ బోధన చేపట్టామని గ్రంథాలయాధికారి ఆర్.అనురాధ తెలిపారు.

నందిగాం : పిల్లలకు వేసవిలో విజ్ఞాన శిబిరాలు ఎంతైనా అవసరమని గ్రంథాలయ అధికారి ఎస్.ఉదయ్ కిరణ్ అన్నారు. సీనియర్స్, జూనియర్స్‌గా విభజించి 'స్లో సైక్లింగ్ పోటీలు' నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు కె.రాములమ్మ పాల్గొన్నారు.


టెక్కలి : కోలాటం ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పాతపట్నం : స్థానిక శాఖాగ్రంథాలయంలో డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్ పి.ఆనందరావు, బి.బెనరీజ్జ, స్కూల్ అసిస్టెంట్ కిల్లారి శ్యాంబాబు పాల్గొని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కాళ్ల రాజు పాల్గొన్నారు.

టెక్కలి : స్థానిక శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా జానపద కళలపై అవగాహన కల్పించారు. చదువుతో పాటు కళలపైనా ఆసక్తి కనబరచాలని గ్రంథాలయాధికారి బి.రూపావతి కోరారు. జానపద కళలు అంటే ఏమిటి? అవి ఏవి, ఎందుకు అంతరిస్తున్నాయని అనేవి వివరించారు. అనంతరం విద్యార్థులతో కోలాట ప్రదర్శన చేపట్టించారు. లక్ష్యసాధన కోసం చదువు అవసరమని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు అమ్మనమ్మ, విశ్రాంత ఉపాధ్యాయులు మోహనరావు పాల్గొన్నారు.

సీట్ల భర్తీకి నోటిఫికేషన్

ప్రజాశక్తి- జి.సిగడాం

2024-25 విద్యా సంవత్సరానికి జి.సిగడం ఆదర్శ పాఠశాలలో 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీ కోసం నోటిఫికేషన్ వెలువడినట్టు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లంక అన్నా శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. సదరు విద్యార్థులు జూన్ 10లోపు పాఠశాలలో అప్లై చేసి 11న జరిగే ప్రవేశ పరీక్షకు హాజరు కావాలన్నారు. వివిధ కేటగిరీల వారీగా మిగులు సీట్ల వివరాలను పాఠశాల నోటీసు బోర్డులో ఉంచినట్టు తెలిపారు.

రణస్థలం: స్థానిక కొండములగాం ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి, అలాగే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి సంబంధించి ఎంపిక జాబితా విడుదలైనదని, ప్రైవేశాలు జరుగు తున్నాయని ప్రిన్సిపాల్ పి.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యారులు ఈ నెల 5లోగా సంబంధిత ధ్రువ పత్రాలతో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గుటల్లోగా హాజరు కావాలని కోరారు.

వికలాంగ పిల్లలను గుర్తించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సున్నా నుంచి 18 ఏళ్ల లోపు అంగవైకల్యం ఉన్న పిల్లలను గుర్తించడంలో మే 1 నుంచి సర్వే జరుగుతోందని, ఈనెల 9వరకు జరిగే సర్వే ద్వారా శతశాతం పిల్లలు గుర్తించబడాలని ఎపిసి డాక్టర్ రోణంకి జయప్రకాష్ తెలిపారు. 21 రకాల కేటగిరీల్లో ఉన్న పిల్లలను తప్పనిసరిగా గుర్తించి వారిని స్థానిక పాఠశాలలో చేర్పించాలన్నారు. శనివారం నగరంలో జరిపిన సర్వేను ఆయన పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో జరిపిన సర్వేలో సిపి కేటగిరీకి చెందిన రుత్విక్‌ను, మానసిక వైకల్యం చెందిన నిరుపమలను గుర్తించారు. ఉపాధ్యాయురాలు కుసుమ కుమారి, చెల్లమ్మ పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో పాల్గొన్న గ్రామస్తులు

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- పొందూరు

మండలం గోరింటలో కూన అవినాష్ 5వ వర్ధంతి సందర్భంగా అవినాష్ సావే ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా అవినాష్ చిత్రపటానికి ఆటో ట్రికల్ మేనేజింగ్ డైరెక్టర్ చింతాడ సింహాచలం, అవినాష్ తండ్రి, అవినాష్ సావే ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ కూన వెంకటరావు, కార్యదర్శి దుంపల మృదల, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు, పలువురు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ వైద్య శిబిరాన్ని గోరింట మాజీ సర్పంచ్ చింతాడ కృష్ణ వాసుదేవరావు ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో సుగర్, ఇసిజి, బిపి పరీక్షలు ఉచితంగా చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. ఉన్నత చదువులు చదివి అమెరికాలో ఉద్యోగం చేస్తూ చనిపోయిన తన కుమారుడు అవినాష్ పేరుతో పలు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న వెంకట రావును ప్రముఖులు, గ్రామ ప్రజలు అభినందించారు. ఈ వైద్య శిబిరంలో మెడికవర్ వైద్యులు న్యూరాలజిస్ట్ పైల మురళీధరరావు, సీనియర్ యూరాలజిస్ట్ డి.హరి ప్రసాద్, సీనియర్ కార్డియాలజిస్ట్ బుడుమూరు అన్నాజీ రావు, జనరల్ మెడిసిన్ తమ్మినేని వేణుగోపాలరావు ఆర్థో అన్నెపు శివప్రసాద్, పల్మనాలజిస్ట్ మొజ్జాడ ధనంజయరావు, జనరల్ ఫిజీషియన్ కె.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మండలం రాగోలులో ఉన్న మజ్జి గౌరమ్మ గుడి సెంటర్‌లో మేము సైతం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఆమదాలవలస, శ్రీకాకుళం ప్రధాన రహదారిపై వందలాది మంది వాహన దారులకు ఉపశమనం కలిగిస్తున్నారు. కార్యక్రమంలో చల్ల దుర్గారావు, వై.రామకృష్ణ, సత్య నారాయణ, రమణమూర్తి, పొట్నూరు అప్పారావు, రమణ, విష్ణుమూర్తి, గోవిందరావు, లక్ష్మణరావు, భాస్కరరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మలకాంలో 'ఉపాధి' సంబరాలు

పొందూరు: మండలంలో మలకాంలో ఉపాధిహామీ కూలీలు ఉపాధిహామీ సంబరాలను శనివారం జరిపారు. గ్రామంలో కూని చెరువులో 80రోజులు పనిదినాలు పూర్తి కావడంతో కూలీలు సంబరాలు జరుపుకున్నారు. కూలీ నగదు పూర్తిస్థాయిలో రావడంతో ఆనందంగా గడిపారు. ప్రతిఏటా ఇక్కడ ఉపాధి సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. సహపంక్తి భోజనాలను ఏర్పాటు చేసుకున్నారు.

గొడవలు వద్దు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి 4న వెలువడనున్న ఫలితాలు దృష్ట్యా జయాపజయాలపై గొడవలు పడొద్దని రూరల్ ఎస్ఐ లక్ష్మణరావు అన్నారు. ఈ మేరకు బైక్ ద్వారా శనివారం అవగాహన కల్పించారు. ఈ నెల 6 వరకు ఎన్నికల కోడ్ అమలు ఉందని, అనవసరంగా గొడవలు, ఘర్షణలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు అందరూ సహకరించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించి గొడవలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురంలో శుక్రవారం రాత్రి కురిసిన ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి 12 ట్రాన్స్ ఫార్మర్లు దెబ్బతిన్నాయని విద్యుత్ శాఖాధికారి గోవిందరావు తెలిపారు. శనివారం ఆరు ట్రాన్స్‌ఫార్మర్లను మార్పు చేశామని, మిగతా ఆరు ఆదివారం పూర్తి చేస్తామని అన్నారు. వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఇబ్బంది లేకుండా చేస్తామని తెలిపారు.


ట్రాన్స్‌ఫార్మర్ మారుస్తున్న సిబ్బంది

తొలిరోజు 91శాతం పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జూన్ నెలకు సంబంధించి పింఛన్ల పంపిణీ శనివారం ప్రశాంతంగా సాగింది. జిల్లాలో 3,19,702 మంది లబ్ధిదారులకు సంబంధించి రూ.93.30 కోట్లు విడుదలైంది. ఇందులో 2,38,993 మందికి బ్యాంకు ఖాతాల్లో జమ చేసే పని జరుగుతుంది. తొలిరోజు 50 శాతానికి పైగా ఖాతాల్లో జమ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. వికలాంగులు, అనారోగ్యంగా ఉన్న వృద్ధులకు సంబంధించి 80,709 మందికి రూ.21.06 కోట్లను పంపిణీ చేయాల్సి ఉంది. వీరిలో తొలిరోజు 73,906 మందికి రూ.19.72 కోట్లను అందించారు. మొత్తం 91.57 శాతం మేరకు పింఛన్ల పంపిణీ చేపట్టారు. ఇంకా 6,803 మందికి రూ.1.88 కోట్లను పంపిణీ చేయాల్సి ఉంది. వాస్తవానికి ఈ నెల 5వ తేదీ వరకూ పింఛన్ల పంపిణీ చేయాల్సి ఉన్నా... ఈ నెల 4న ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో 3వ తేదీలోగానే పంపిణీ ముగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

యూనియన్ బ్యాంకు ద్వారా మెరుగైన సేవలు

శ్రీకాకుళం అర్బన్: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా యూనియన్ బ్యాంకు పని చేస్తోందని విశాఖపట్నం జోనల్ జనరల్ మేనేజర్ షాలిని మీనన్ అన్నారు. నగరంలోని వెంకటాపురం యూనియన్ బ్యాంకు కార్యాలయంలో బ్యాంకు రిటైల్ ఎక్స్‌పో 2024ను ఆమె శనివారం ప్రారంభించారు. రుణమేళాలో ఖాతా దారులకు తక్షణమే రుణాలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. ఎక్స్‌ఫోలో వివిధ నిర్మాణ రంగ సంస్థల ప్రతినిధులు, రియల్ ఎస్టేట్, కార్ డీలర్లు, ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్లు పాల్గొన్నారదీ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో యూనియన్ బ్యాంకు అత్యంత వేగంగా అభివృద్ధి సాధిస్తోందన్నారు. బ్యాంకులో ప్రతినెల రూ.14వేలు చెల్లిస్తే ఐదేళ్లలో రూ.10లక్షల చెల్లిస్తుందని, ఇది గొప్ప అవకాశమని తెలిపారు. ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలన్నారు. రీజనల్ హెడ్ ఎం.వెంకటతిలక్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శ్రీకాకుళం జిల్లా లీడ్ బ్యాంక్‌గా ఉందని అర్హత కలిగిన ఖాతా దారులకు వెంటనే ఋణాలు మంజూరు చేస్తున్నా మన్నారు. గతేడాది రిటైల్ ఎక్స్‌పో ద్వారా రూ.150 కోట్ల మేర రుణాలు అందజేశామని, ఈ ఏడాది రూ.200 కోట్ల మేర రుణాలు అందజేయడమే లక్ష్యంగా పని చేస్తున్నా మన్నారు. ఈ ఎక్స్ పోలో సుమారు రూ.8.60 కోట్ల గృహ, వాహన, విద్యా, వ్యక్తిగత రుణాలు మంజూరు చేశామన్నారు. రూ.14. కోట్ల విలువైన రుణాలకు సంబంధించి ధరఖాస్తులను స్వీకరించామని వివరించారు.


మాట్లాడుతున్న షాలిని మీనన్

పలాస : పలాసలో నూతనంగా ఏర్పాటు చేసిన యూనియన్ బ్యాంకును విశాఖ జోనల్ అధికారి శాలిని మీనన్ ప్రారంభించారు. శ్రీకాకుళం రీజనల్ అధికారి ఎం.వెంకట్ తిలక్, సేవా విభాగం అధికారి మురళీకృష్ణ, కాశీబుగ్గ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ఎస్.రవికుమార్, రీజనల్ సెక్రటరీ తేజేశ్వరరావు, మేనేజర్ లలితకుమారి పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


పట్టుబడిన ద్విచక్ర వాహనాలతో ఎస్ఐ, సిబ్బంది

ప్రజాశక్తి- ఆమదాలవలస

శాంతి భద్రతలక విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తప్పవని ఎస్ఐ కె.వెంకటేష్ అన్నారు. శనివారం మండలం లోని వంజంగిలో పోలీసు సిబ్బందితో కలిసి కార్డాన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని గడ్డివాములు, దుకాణాలు, అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. పలు గృహాల వద్ద ఉన్న ద్విచక్ర వాహనాలను గుర్తించి యజమానుల నుంచి పత్రాలను అడిగి పరిశీలించారు. రెండు ద్విచక్ర వాహనాలకు ఎటువంటి పత్రాలు లేక పోవడంతో వాటిని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసేటప్పుడు వాహనానికి సంబంధించిన పత్రాలు అన్ని సరిచూసుకొని కొనుగోలు చేయాలన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు మైనర్లకు ఇవ్వకూడదన్నారు. ఎన్నికల వివాదాల్లో తలదూర్చి కేసుల్లో ఇరుక్కొని విలువైన కాలాన్ని, జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. ప్రతిఒక్కరూ చట్టానికి లోబడి నడుచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

సైనికుల త్యాగాలు వెలకట్టలేనివి

వజ్రపుకొత్తూరు: సైన్యం త్యాగాలకు దేశం ఎప్పుడూ రుణపడి ఉంటుందని పెద్దమురహరిపురం సర్పంచ్ గోరకల వసంతస్వామి అన్నారు. మండలంలోని పెద్ద మురహరిపురంలో సైనిక సేవా సమితి అధ్యక్షుడు కలిశెట్టి దేవదాసు అధ్యక్షతన శనివారం ఆర్మీ రైజింగ్ దినోత్సవ వేడుకలు శనివారం నిర్వహించారు. ముందుగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భారత సైన్యం త్యాగాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం సైనంలో సుదీర్ఘకాలం పనిచేసి ఆర్డినరీ కెప్టెన్‌గా ఉద్యోగ విరమణ పొందిన కలిశెట్టి చలపతిరావు, శ్యామలకుమారి దంపతులను సైనిక సేవా సమితి ఆధ్వర్యాన ఘనంగా సన్మానించారు. సుమారు 30 ఏళ్ల పాటు భారత సైన్యంలో వివిధ హోదాల్లో పనిచేసి మధురలో ఉద్యోగ విరమణ పొందారు. కార్యక్రమంలో సైనిక సేవా సమితి గౌరవ అధ్యక్షులు టి.మురళి, కోశాధికారి అద్ది రామారావు, గోరకల రామారావు మాజీ సర్పంచ్ కలిశెట్టి గోపాల్ పాల్గొన్నారు.


సన్మానిస్తున్న మాజీ సైనికులు

నారాయణపురం హైలెవల్ కాలువ మరమ్మతులు


కాలువను పరిశీలిస్తున్న రవికుమార్

ఆమదాలవలస: నియోజకవర్గంలోని ఆమదాలవలస, బూర్జ మండలాల్లో సుమారు 5 వేల ఎకరాలకు సాగునీరు అందించే నారాయణపురం ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్‌కు సుమారు రూ.4 లక్షలు సొంత నిధులతో వైసిపి ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ శనివారం మరమ్మతులు చేయించారు. కాలువలో పేరుకుపోయిన పూడిక తీయించడంతో పాటు వరదతో గండి కొట్టుకు పోయిన కాలువ గట్లు మరమ్మతులు వంటి పనులను చేయిస్తున్నారు. బూర్జ మండలం చీడివలస దగ్గర నుంచి ఆమదాలవలస మున్సిపాలిటీ రావికంటిపేట వరకు గల ఈ కాలువ మరమ్మతు పనులను రవికుమార్ రైతులతో కలిసి దగ్గరుండి చేయిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే ఈ మరమ్మతు పనులను పూర్తి చేయాలన్న లక్ష్యంతో గత 20 రోజులుగా పనులను రైతుల సహకారంతో చేయిస్తున్నారు. ఈ కాలువ మరమ్మతు పనులు పూర్తయితే ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టుకు గల ప్రతి ఎకరాకు సాగు నీరు పుష్కలంగా అందుతుందని, పంటలకు ఇబ్బంది ఉండదని రైతులు పేర్కొన్నారు. ప్రతిఏటా సాగునీరు అందక పలు ఇబ్బందులు ఎదుర్కొన్నామని ఈ కాలువ మరమ్మతులతో రైతుల ఇబ్బందులు తొలగి పంటలకు పుష్కలంగా సాగునీరు అందుతుందని పలువురు రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే రవికుమార్ ధాతృత్వానికి ఆయకట్టు రైతాంగం అభినందించారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన

ఆమదాలవలస: ప్రభుత్వం ఈనెల సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ గత నెల మాదిరిగానే నేరుగా బ్యాంకు ఖాతాలకు జమ చేయడంతో పాటు వికలాంగులు, వృద్ధులు, బ్యాంకు ఖాతా ఆధార్‌తో అనుసంధానం కాని వారికి సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికి పంపిణీ చేయించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు గ్రామాల్లో పర్యటించి పరిశీలి ంచారు. చీమలవలసలో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరై అర్హులందరికీ శతశాతం వెంటనే పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు. తాత్కాలికంగా క్యాంపులు వెళ్లిన వారిని, అనారోగ్య రీత్యా ఆస్పత్రికి వెళ్లిన లబ్ధిదారులను గుర్తించి గ్రామ సంఘం, వెలుగు సిబ్బంది ద్వారా సమాచారం అందించి వెంటనే పంపిణీ చేయించాలని తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ కూన వెంకట సత్యం తో పాటు క్లస్టర్ కో-ఆర్డినేటర్ చంద్రరావు, హరికృష్ణ పాల్గొన్నారు.


పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎపిఎం కూర్మారావు

పెద్దపాడులో అన్నదానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

అన్ని దానాల్లో కంటే అన్నదానం గొప్పదని శ్రీకాకుళం నియోజకవర్గ టిడిపి అభ్యర్థి జి. శంకర్ అన్నారు. మండలంలోని పెద్దపాడు వద్ద హనుమాన్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


అన్నదాన కార్యక్రమంలో వడ్డిస్తున్న శంకర్


చికిత్స అందిస్తున్న 108 సిబ్బంది

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- కొత్తూరు

పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం కొరమ బ్రిడ్జి వద్ద శనివారం లారీని మరో లారీ ఢీకొన్నడంతో క్యాబిన్‌లో డ్రైవర్, క్లీనర్ ఇరుక్కున్నారు. కొత్తూరు నుంచి బత్తిలి వెళ్తున్న లారీ బ్రిడ్జి వద్ద ముందు వెళ్తున్న మరో లారీని బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు క్షతగాత్రులను బయటకు తీసి 108లో కొత్తూరు సామాజిక ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు.


పరిశీలిస్తున్న పశువైద్యాధికారి శిరీష

పిడుగుపాటుకు నాలుగు ఆవులు మృతి

కంచిలి: మండలంలోని జెన్నాఘాయికు చెందిన నల్ల భాస్కరరావు అనే పాడి రైతుకు చెందిన ఆవు శుక్రవారం పిడుగు పాటుకు గురై మృతి చెందింది. అదే గ్రామానికి చెందిన నేల కాశీ బెహరా పొలంలో మంద వేసి ఉంచిన మూడు ఆవులతో పాటు ఒక లేగ దూడ పిడుగు ప్రభావానికి గురై మృతి చెందాయి. సమాచారం తెలుసుకున్న పశువైద్యాధి. కారిని శిరీష, విఆర్ఒ బాలాజీ సంఘటన స్థలాలకు వెళ్లి పరిశీలించారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.


నేలమట్టమైన రేకు ఇల్లు

మూడు ఇళ్లు నేలమట్టం

మెళియాపుట్టి: మండలంలో నందవలో శుక్రవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు మూడు రేకిళ్లు నేలమట్ట మయ్యాయి. సవర అప్పన్న, సవర చిన్నబాబు, పెద్ద సొంబురులకు చెందిన రేకిళ్లు నేలమట్టం కావడంతో రూ.లక్ష మేర ఆస్తి నష్టం సంభవించింది. గాలులకు నష్టపోయిన తమను ఆదుకోవాలని బాధితులు ప్రభుత్వానికి కోరారు. సంఘటన స్థలాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

బెల్లం ఊటలు ధ్వంసం

మెళియాపుట్టి: మండలంలోని నేలబొంతులో టెక్కలి సెబీ ఎన్‌ఫోర్స్‌మెంట్, పలాస డిటిఎఫ్ సిబ్బంది సారా తయారీ స్థావరాలపై శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అనంతరం 30 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నాటుసారా తయారీ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సెబీ సిఐ జి.రాజశేఖర్ నాయుడు, డిటిఎఫ్ సిఐ రామచంద్రకుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ ఉపకరణాలు దగ్ధం

సోంపేట: మండలంలోని పలాసపురం ఇందిరమ్మ కాలనీలో కోత జానకమ్మ, బల్లెడ ప్రసన్నకుమార్ అనే వ్యక్తుల ఇళ్ల సమీపంలో శుక్రవారం రాత్రి పిడుగు పడింది. పిడుగు పడిన ప్రభావానికి ఇళ్ల పైభాగం కొంత ధ్వంసం కాగా, ఇళ్లలోని విద్యుత్ ఉపకరణాలు దగ్ధమైనట్లు బాధితులు తెలిపారు. సంఘటన స్థలాన్ని సర్పంచ్ తడక జోగారావు సందర్శించి బాధితులను పరామర్శించారు. సుమారు రూ.50 వేలు వరకు ఆస్తినష్టం జరిగే ఉన్నట్లు బాధితులు తెలిపారు.


అల్లర్లు సృష్టిస్తే చర్యలు

పాతపట్నం: ఈ నెల 4న ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా 144 సెక్షన్ అమల్లో ఉందని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని, అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవని సిఐ నల్లిసాయి హెచ్చరించారు. శనివారం ఎగ్జిట్‌పోల్ విడుదల సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి వివాదాలు లేకుండా ప్రజలు అప్రమత్తంగా మెలగాలని సూచించారు. 4న ఎటువంటి విజయోత్సవ సభలకు, ర్యాలీలకు, బాణసంచా కాల్పులకు అనుమతులు లేవని సూచించారు. ఈయనతో పాటు ఎస్ఐ మహమ్మద్ యాసిన్ ఉన్నారు.

ఒక విద్యార్థి... 9 మంది సిబ్బంది

ప్రజాశక్తి- టెక్కలి

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ముగింపులో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన సంస్కృతం పరీక్షకు ఒక్క విద్యార్థి మాత్రమే హాజరయ్యారు. ఫీజు కూడా ఒక్కరే చెల్లించారు. ఇందుకు గాను పరీక్ష రాసే ఒక్క విద్యార్థికి ఒక ఇన్విజిలేటర్, చీఫ్ సూపరింటెండెంట్‌గా ఉత్తరక వాటం గణపతిరావు, డిపార్టుమెంట్ అధికారిగా శేషగిరి వ్యవహరించారు. క్లర్కుగా కుప్పిలి నగేష్, కానిస్టేబుల్, ఇద్దరు ఆయాలు, ఇద్దరు ఆరోగ్య సిబ్బంది కలిపి 9 మంది పాల్గొన్నారు. ఒక్క విద్యార్థి పరీక్ష కోసం 9 మంది సిబ్బంది విధులు నిర్వహించడం గమనార్హం.



మాట్లాడుతున్న జడ్జి పరేష్‌కుమార్

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన

ఇచ్ఛాపురం: ప్రతి ఒక్కటీ భూమి నుంచి వస్తుందని, దానిని మనమే దర్వినియోగం చేసి మరలా భూమిలో సాలిడ్ వేస్టుగా కలుపుతున్నామని జూనియర్ సివిల్ జడ్జి పరేష్‌కుమార్ అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో సాలిడ్ వేస్టు మేనేజ్‌మెట్‌పై శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. సాలిడ్ వేస్టు మేనేజ్‌మెంట్ ఎక్కడి నుంచి వస్తుంది, దానిని ఎలా మ్యానేజ్ చేయాలో వివరించారు. సదస్సులో మున్సిపల్ కమిషనర్ రమేష్, బార్ అసోసి యేషన్ అధ్యక్షుడు ఎన్.రమణయ్యరెడ్డి, దేవరాజు, నాగరాజు పాత్రో, కృష్ణమూర్తిరెడ్డి, సీతయ్యరెడ్డి, భైరి పాల్గొన్నారు.

ఝాన్సీకి అభినందనలు

కవిటి: ఎపి ఐసెట్‌లో కవిటి ఎస్‌విజె విద్యార్థి పులారి ఝాన్సీ 1122 ర్యాంకుతో సత్తా చాటినట్టు ప్రిన్సిపాల్ భాస్కరరావు తెలిపారు. ఈ సందర్భంగా కరస్పాం డెంట్ బి.వి.వి.ప్రసాదరావు, ఎస్‌విజె సిబ్బంది ఝాన్సీకి శనివారం అభినందనలు తెలిపారు.